క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



బెల్లంకొండ: ప్రభుత్వం రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు ఏఓ కృష్ణయ్య తెలిపారు. 50 శాతం సబ్సిడీపై జనుము 10 కేజీలు రూ.420, జీలుగ రూ.395, పిల్లిపెసర రూ.388 లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, మొబైల్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేతో రైతులకు మేలు



పెదకూరపాడు: భవిష్యత్తు తరాలకు భూ వివాదం లేని ఆస్తి అందజేయడమే సమగ్ర భూ సర్వే లక్ష్యమని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. 75 త్యాళ్లూరు రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న రీ సర్వే విధానాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం కొలతలు వేసి హద్దురాళ్లు ఉచితంగా వేస్తున్నారన్నారు. రైతులు సర్వేయర్‌కు సహకరించి లింకు డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు చూపించి హెచ్చుతగ్గులు ఉంటే సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ గోగులపాటి కోమలి, వీఆర్వో ప్రసాద్, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డిలు ఉన్నారు.

సేవా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లు

క్రోసూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ల సేవా పురస్కారాల్లో భాగంగా మండలంలో గుడిపాడు గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావుకు సేవా వజ్ర పుస్కరారం, మండలంలోని 88 త్యాళ్లూరుకు చెందిన వలంటీర్ మోదెల ఆదిలక్ష్మీ, ఊటుకూరు భీమిరెడ్డి సుహాసిని, క్రోసూరు-3 సాడిసెట్టి సురేంద్రకుమార్, అందుకూరు చిల్కాప్రకాశరావు, దొడ్లేరు-2 షేక్ బాజి సేవారత్నా పురస్కారాలకు ఎంపికయ్యారు. మిగతా వారు 269 మంది సేవా మిత్రలుగా ఎంపికయ్యారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. సేవాపురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

సత్తెనపల్లి: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ గురైన ఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల బైక్ స్టాండ్ సమీపంలో బుధవారం జరిగింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కండక్టర్‌గా పని చేస్తున్న శౌరికి అన్నం క్యారేజి ఇచ్చేందుకు భార్య రుతు వెళ్తుండగా ఎదురుగా బైక్ పై వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. దీనిపై బాధితురాలు రుతు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు. శోభన్ బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీల ఆధారంగా దుండగుడి కదలికలను ఆరా తీస్తున్నారు.

ఇసుక లారీ బోల్తా



అచ్చంపేట: ఇసుక లారీ బోల్తాకొట్టిన ఘటన మండలంలోని అచ్చంపేట-వేల్పూరు మధ్యలో గల నిదానంపాటి అమ్మవారి దేవాలయానికి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న లారీ ముందు టైర్ బరస్ట్ కావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బొల్తా కొట్టింది. లారీలోని ఇసుక మొత్తం రోడ్డుపై పడిపోయింది. డ్రైవర్‌కు కొద్దిపాటి గాయాలైనాయి. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

తూబాడులో రీసర్వే పనులు

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పనులు ప్రారంభమయ్యాయి. రీసర్వే పనులను సాతులూరు వీఆర్వో మురళీకృష్ణ ఇన్‌చార్జిగా పర్యవేక్షిస్తున్నారు. వీఆర్వో అనూష, అంజలి, సచివాలయ కార్యదర్శులు షేక్ నాగూర్ బాష, షేక్ సైదాబి, త్రిపాల్‌లు సర్వే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్వే చేపట్టిన భూములకు సంబంధించిన రైతులు దస్తావేజులు, సంబంధిత ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. సమస్యలున్నట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పోషకాహారం

బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేందుకు సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా పోషకాహారాన్ని అందిస్తున్నారు. 300 నుంచి 500 మీటర్ల దూరం కేంద్రాలకు వెళ్లి ఆహారం తీసుకు నేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జులై ఒకటి నుంచి లబ్ధిదారులకు నిర్దేశిత పరిమాణంలో సరుకులను ఇంటికే ఇవ్వనున్నారు. పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసు కుంటారా, ఇంటికి తీసుకెళ్లేందుకు ఇష్టపడుతున్నారా, సరుకులు ఇంటికి ఇవ్వమంటారా .. అని ఇప్పటికే లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎక్కువ మంది ఇంటికే అందించాలని సూచించడంతో ఉన్నతాధికారులకు ప్రభుత్వానికి నివేదించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

- ఎక్కువ మంది కేంద్రాలకు రాకపోవడంతో నిర్ణయం
- నెలలో రెండు విడతలుగా పంపిణీ
- జూలై ఒకటి నుంచి పంపిణీకి పకడ్బందీగా చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల బాలింతలు, గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కార్యక్రమాల కింద ప్రతి నెలా పోషకాహారం అందిస్తున్నారు. కానీ కేంద్రాలు దూరంగా ఉండటంతో కొందరు, ఆరోగ్య సమస్యల కారణంగా ఇంకొందరు .. ఇలా ఎక్కువ మంది రావడం లేదు. ఈ నేపథ్యంలో పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసుకుంటారా, ఇంటికి తీసుకువెళ్తారా, సరకులు ఇంటికి ఇవ్వమంటారా .. అని గత నెలలో లబ్ధిదారుల నుంచి అభిప్రాయం సేకరించారు. అధిక శాతం మంది ఇంటికే అందించా లని చెప్పడంతో మళ్లీ లబ్ధిదారులకు సరకులు ఇంటికే ఇవ్వాలని అధికారులు నిర్ణ యించారు. జులై ఒకటి నుంచి అది అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో కొవిడ్ సమయంలో రెండేళ్ల పాటు టీహెచ్ఆర్ (టేక్ హోం రేషన్) పేరుతో సరకులు లబ్ధిదారుల ఇళ్లకే అందించారు. కొవిడ్ తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలను మళ్లీ తెరిచారు. ప్రభుత్వం గతే డాది జూన్ ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే లబ్ధిదారులకు వేడిగా భోజనం వండి పెట్టాలని ఆదేశించింది. ఆ మేరకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించారు. కానీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో కొంత వెసులుబాటు కల్పించారు. నెలలు నిండటం, ఆరోగ్య సమస్యలు, చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో ఇంటికి తీసుకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. మెజార్టీ సభ్యులు ఇంటికే సరకులు ఇవ్వాలని సూచించడంతో నెలలో రెండు విడతలుగా వీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 3 నుంచి 7 ఏళ్లలోపు చిన్నారులకు పోషకాహారం ఇంటికే ఇస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు	
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	303
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు:	04
గర్భిణులు:	1,535
బాలింతలు:	1,702
చిన్నారులు:	20,335

నెలకు అందించే ఆహారం (ఒక్కొక్కరికి) ..
బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, నూనె 500 గ్రాములు, గుడ్లు 25, పాలు 5 లీటర్లు, రాగిపిండి 2 కిలోలు, అటుకులు కిలో, ఖర్జూరం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు.

రెండు విడతలుగా అమలు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పోషకాహారం జులై ఒకటి నుంచి సరకుల రూపంలో లబ్ధిదారుల ఇంటికే ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రతి నెలా ఒకటి నుంచి 5 వ తేదీల మధ్య మొదటివిడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం అందిస్తాం. రెండో విడతగా 16,17 వ తేదీల్లో కోడిగుడ్లు, పాలు ఇస్తారు.

–టి.శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి

ఏళ్లనాటి కల సాకారమవుతున్న వేళ

- చేజర్ల ప్రజల దాహార్తికి శాశ్వత పరిష్కారం
- 200 ఎకరాలకు పైగా భూమికి సాగునీరు
- రూ3.47కోట్లతో ఎత్తిపోతల పథకానికి నేడు శంకుస్థాపన



చేజర్ల గ్రామం వద్ద ఎత్తిపోతల పథకానికి సిద్ధం చేసిన బేతంరాజు చెరువు

నకరికల్లు: మండు వేసవే కాదు... వర్షాకాలంలోను తాగునీటి ఎద్దడి..ఉన్న కొద్దిపాటి నీటితో సర్దుకుపోవాల్సిన పరిస్థితి..చెంతనే ఎన్నెస్పీకెనాల్ ఉన్న సాగునీరందక బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి.. గత 30 ఏళ్లకు పైగా పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్ల గ్రామస్తుల పరిస్థితి ఇది. ప్రభుత్వాలు మారుతున్నా...పాలకులు మారుతున్నా..తాగునీటికి, సాగునీటికి శాశ్వత పరిష్కారం లేక గ్రామస్తులు ఏ ఏడాదికాఏడాది సర్దుకుపోతున్నారు. గత 30 ఏళ్లగా తమ సమస్యను ఎందరికో విన్నవించారు... పరిష్కామవుతుందని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూపులే తప్ప పరిష్కార మార్గం లేక అవస్థలు పడుతున్నారు.. ఇదంతా గతం... ప్రస్తుతం గత 30 ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక మారుమూల గ్రామాల్లో సైతం మౌలికవసతుల కల్పనకు, తాగునీటి, సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి దృష్టి సారించిన విషయం విదితమే. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో చేజర్ల గ్రామంలోని అతిపురాతనమైన బేతంరాజు చెరువును తిరిగి వినినియోగం తెచ్చారు. రూ 3.47 కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నెస్పీ కెనాల్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా 4.92 క్యూసెక్కుల నీటిని బేతంరాజు చెరువుకు మళ్లిస్తారు. అక్కడి నుంచి గ్రామంలోని ప్రజానీకం అందరికీ తాగునీటిని అందించి వారి దాహార్తిని తీర్చే గొప్ప కార్యక్రమం చేపట్టనున్నారు. గ్రామంలోని సుమారు 1,250 కుటుంబాలకు చెందిన సుమారు 5 వేలమంది ప్రజానీకానికి తాగునీరు అందించడంతో పాటు సుమారు 200 ఎకరాలకు పైగా సాగునీరందించి సస్యశ్యామలం చేయనున్నారు. ఎత్తిపోతల పథకానికి గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నారు. పనులు వేగవంతంగా చేపట్టాలని మంత్రి ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపడతున్నారు. దీంతో 30 ఏళ్ల కల సాకారం కానుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.83 లక్షల మిరప విత్తనాలు అమ్మకాలు నిలుపుదల



పట్టణంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు విత్తన దుఖానాలను జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయం నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్. రవి కుమార్, వ్యవసాయ అధికారిణి ఎ.వరలక్ష్మి, వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి, యస్ శ్రీధర్ రెడ్డిలు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సత్తెనపల్లి పట్టణంలోనీ ఆదిత్య సీడ్స్, విత్తన షాపులో పరిమాణం 1.8 కేజీల మిరప విత్తనాలు విలువ రూ.1,83,600 సోర్స్ సర్టిఫికెట్ లేనందున అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ సందర్భముగా ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విత్తన డీలర్లు కూడా అధీకృత కంపెనీల దగ్గర నుండే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్స్ అందరూ విత్తన స్టాక్ నిల్వలు, ధరల పట్టిక రైతులందరికీ తెలిసే విధంగా షాపులలో ప్రదర్శించాలని, స్టాక్ వచ్చిన వెంటనే మండల వ్యవసాయ అధికారి వారికి సమాచారం అందించాలని సూచించారు. రైతులు లైసెన్స్ డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కోనుగోలు చేయాలని సూచించారు. బిల్లులో లాట్ నంబర్, విత్తన రకం తప్పకుండా నమోదు చేసి ఇవ్వాలని సూచించారు. విత్తన డీలర్స్ ఎవరైనా ప్రత్తి, మిరప విత్తనాలు అధిక ధరలకు విత్తనాలు విక్రయించినట్లైతే సంబంధిత డీలర్స్ పై చట్టపరమైన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు డిమాండ్ ఉన్న విత్తనాలకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించరాదని సూచించారు.

రూ.4.82 లక్షల పురుగు మందులు సీజ్
సత్తెనపల్లి: పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను జిల్లా వ్యవసాయ అధికారివారి కార్యాలయం నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్.రవి కుమార్, వ్యవసాయ అధికారిణి ఎ.వరలక్ష్మి, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీధర్ రెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని నవత ట్రాన్స్‌పోర్టులో ఎటువంటి పత్రాలు లేకుండా వచ్చినటు వంటి పురుగు మందుల నిల్వలను సీజ్ చేశారు. సీజ్ చేసినటువంటి పురుగు మందుల మొత్తం విలువ రూ.4,82,000. సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టుల ద్వారా పత్తి, మిరప, వివిధ పంటల విత్తనాలు, పురుగు మందులు ఏమైనా బిల్లులు లేకుండా, అనధికార స్టాక్స్ ఏమైనా వచ్చినట్లైతే మండల వ్యవసాయ అధికారి వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు,మాజీ ఎమ్మెల్యే యర్రం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఆర్యవైశ్య యువజన సంఘం బాధ్యుడు కొత్త రామకృష్ణ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలో కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నీటి చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాల ద్వారా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడం స్ఫూర్తిదాయక మన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ సామాజిక సేవలను కొనియాడారు. కార్య క్రమంలో మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, నాయకులు శిరిగిరి వెంకట్రావు, గుంటూరు ఆశీర్వాదం, తోట కృష్ణ, తదితరులు ఉన్నారు.

భీమవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలు



ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ షేక్ నజీర్

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం బీమవరం గ్రామంలో డాక్టర్ షేక్ నజీర్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 128 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 46 మంది, హైపర్ టెన్షన్ 25 మంది, డయాబెటిస్ 16 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటీస్ 25 మంది, గర్భవతులు నలుగురు, బాలింతలు నలుగురు, చిన్నారులు 8 మంది ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుశీల, ఏఎన్ఎం విజయకుమారి, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈవో ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు పి.మరియమ్మ, వి.శారదా, టి.లక్ష్మి, జి.పార్వతి, ఉన్నారు.

ఫణిదం గ్రామంలో....
ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి డాక్టర్ వి.ప్రదీప్ బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 89 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జనరల్ ఓపి 66 మంది, హైపర్ టెన్షన్ 10 మంది, డయాబెటిస్ 13 మంది ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేక గృహాల్లోనే ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు పీ.మంజుల మార్గరేట్, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ వి.జైతన్య, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.నరేష్, ఎమ్ఎల్‌హెచ్‌పీ కె.మాధురి, ఏఎన్ఎం పి.లక్ష్మీ కుమారి, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, ఆశ కార్యకర్తలు ఎన్.సునీత, సీహెచ్. చిట్టెమ్మ, డీఈఓ సుధాకర్ ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నెరవేర్చాలి

యడ్లపాడు మండల
ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పిడతల రూన్సీ పక్కన ఎంపీడీవో వై హనుమారెడ్డి

యడ్లపాడు: సమస్యల్ని పరిశీలించి పరిష్కరించడం.. ప్రజాప్రతినిధుల్ని గౌరవించడం అధికారులు ప్రథమ కర్తవ్యంగా గుర్తించాలని ఎంపీపీ పిడతల రూన్సీ చెప్పారు. ఎంపీడీవో వై హనుమారెడ్డి ఆధ్వర్యంలో యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా శాఖల వారీగా ప్రగతి నివేదికలను వివరించాలని ఎంపీపీ కోరారు. తొలిగా ఎంఈవో ఐ ఆంజనేయులు విద్య విషయాలను తెలిపారు. 2022-23 పదివార్షిక పరీక్షలకు 460 విద్యార్థులు రాయగా, వారిలో 253 మంది ఉత్తీర్ణులై మండలం 55శాతం నమోదైందన్నారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్‌కుమార్, ఎం శ్రీనివాసరెడ్డి లేచి భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బడుల రూపురేఖల్ని మార్చి గొప్ప విద్యా పథకాలు తెచ్చి రూ.కోట్ల వ్యయంతో అన్నింటికీ ఉచితంగా అందిస్తుంటే..క్వాలిఫైడ్ టీచర్లు కొందరు క్వాలిటీ విద్యను అందించకపోవడం, అధికారుల సరైన పర్యవేక్షణ కొరవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని మండిపడ్డారు. వివిధ శాఖల అధికారులు నివేదిక తర్వాత ఎంపీపీ రూన్సీ మాట్లాడారు. మండలం పరిధిలోని పలు సమస్యల్ని రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదలై సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. కొత్తసాలన అంగన్‌వాడీ భవనం పూర్తయి త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు వచ్చే మీటింగ్‌లో రిపీట్ కాకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగుకు సిద్ధమైన రైతులకు అనుకూలమైన విత్తనాలు తెప్పించేలా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. యడ్లపాడు జెడ్పీ హైస్కూల్లో ఈ ఏడాది నుంచి బాలికల ఇంటర్మీడియేట్ కళాశాల అందుబాటులోకి వచ్చిందని, ఇక్కడ ఎంపీసీ, బైపీసీ కోర్సులు బోధిస్తారని సభ్యులు ఈ విషయంలో ప్రజల్ని చైతన్యం చేసి కళాశాల విద్యకు ప్రొత్సాహం అందించాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 47 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సీఎస్‌జీఎల్‌ఎమ్, వాసవీ, వృందా జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీఎస్‌జీఎల్‌ఎమ్ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 110 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 100 హజరుకాగా 10 మంది, సీనియర్ ఇంటర్‌లో 58 మది పరీక్ష రాయాల్సి ఉండగా 46 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. వాసవీ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 83 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 73 హజరుకాగా 10 మంది, సీనియర్ ఇంటర్‌లో 23 మది పరీక్ష రాయాల్సి ఉండగా 21 మంది హజరు కాగా ఇరువురు గైర్హాజరయ్యారు. వృంద జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ 48 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 38 హాజరుకాగా 10 మంది, సీనియర్ ఇంటర్‌లో 28 మది పరీక్ష రాయాల్సి ఉండగా 25 మంది హజరు కాగా ముగ్గరు గైర్హాజరయ్యారు.ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షకు సంబంధించి తొలి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూకు మొత్తం 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీబీఆర్సీ, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

అచ్చంపేట: మండల టైలర్స్ అసోసియేషన్ సభ్యుడు చిల్కా చిన్న సుబ్బారావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని డీబీఆర్సీ (దళిత బహుజన రిసోర్స్ సెంటర్) ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలోని నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీబీఆర్సీ మండల కన్వీనర్ సందె పోగు అశోక్, టైలర్స్ యూనియన్ సభ్యులు కరంపాటి కిరణ్, రమేష్, ఏడుకొండలు, మౌలాలి, నీలయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పూజా సామాగ్రి విక్రయాలకు బహిరంగ వేలం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోగల అడవిలో స్వయంభుగా వెలసిన సత్తెమ్మతల్లి దేవాలయం వద్ది పలు పూజాసామాగ్రి విక్రయాల హక్కుకై స్థానిక మల్లేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం జరిగిన బహిరంగ వేలం ప్రశాంతంగా జరిగింది. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయాల హక్కుపై రూ.8,10,000, భక్తులు అమ్మవారికి సమర్పించిన కొబ్బరిచిప్పలు, చీరెలు, జాకెట్‌ముక్కలు పోగుచేసుకునేందుకు రూ.6,35,000, టెంటు సామాన్లు అద్దెకు ఇచ్చుకునే హక్కుపై రూ.7,10,000 మొత్తం కలిపి రూ.21,55,000లకు వివిధ గ్రామాలకు చెందిన పాటదారులు బహిరంగ వేలంద్వారా హక్కు పొందారు. పాట హక్కు ఈ యేడాది జూన్ 13 నుంచి, 2024 జూన్ 12వరకు అమలులో ఉంటుందని దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి గాదె కోటిరెడ్డి తెలిపారు. గత యేడాది పాట కన్నా ఈ యేడాది రూ.5,23,000 పోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవస్థాన చైర్మన్ గుదారి గోపి, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, వెంకట్రావు దంపతులు, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషోరబాలికలకు రక్తహీనతపై అవగాహన

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అడోల్‌సెంట్ క్లినిక్ కౌన్సిలింగ్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాల అంకమ్మబాయి పాల్గొని యుక్తవయసు బాలికల్లో రక్తహీనత, దానిని అధికమించడంపై అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారం, తీసుకోవాల్సిన విటమిన్ మాత్రల గురించి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దీనకుమారి, ధనలక్ష్మీ, దేవకుమారి, సిరాజిని,ఆశ వర్కర్లు విజయలక్ష్మీ, అంజమ్మ, పాల్గొన్నారు. ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

పెదకూరపాడు: మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సాయంత్రం 4 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

పారదర్శకతతో సబ్‌ప్లాన్ అమలు కావాలి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలులో పాలకులకు పారదర్శకత అవసరమని, ఏయే వర్గాలకు ఆర్థిక స్వాలంబన ప్రణాళికలు సిద్ధం చేసేలా చట్టాన్ని బలోపేతం చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ. జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశం ఏర్పాటులో దేవకుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూల పథకాలు ఊరి చివరనున్న షెడ్యూల్ కులాలు, ఊరి అవతల ఉన్న షెడ్యూల్ తెగలుకు ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అసమానతలు తొలగించడంలో ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో మార్పులు తీసుకు రాలేకపోయాయన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మల్లెల అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అడపామోహన్, జనజాగృతి మండలి అధ్యక్షురాలు పిడతల రమాదేవి, రేపూడి కుమారి, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ రమణమూర్తి మాట్లాడగా, మహిళా నాయకులు మేడే వెంకట రమణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.